క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ రాజు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు, వెలమ కార్పొరేషన్ చైర్మన్ పీవీజీ కుమార్ దర్శించుకుని, ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. వీరి పేరిట అంతరాలయంలో అర్చకులు అష్టోత్తరం పూజ నిర్వహించారు. వేద ఆశీర్వచనం అందించి, ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను దేవస్థానం అధికారులు అందజేశారు.

అప్పన్న అన్నదానానికి విరాళం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి బెంగళూరుకి చెందిన చామర్తి మూర్తి రూ.లక్ష 1,116ల విరాళాన్ని నగదు రూపంలో అందించారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదాన్ని, శేషవస్త్రాన్ని అధికారులు అందించారు.

బర్దన్‌కు ఘన నివాళి



బర్దన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

పెందుర్తి: సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, ఉద్యమ నేత ఎ.బి.బర్దన్ 9వ వర్ధంతి సందర్భంగా ఆ పార్టీ నేతలు గురువారం ఘనంగా నివాళి అర్పించారు. సుజాతనగర్ సమీపంలోని బర్దన్‌నగర్‌లో ఉన్న సీపీఐ కార్యాలయంలో బర్దన్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. ఆయన పోరాట పటిమ నేటితరానికి స్ఫూర్తి అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యుడు ఎర్రిపల్లి రాంబాబు, ప్రతినిధులు అన్నపూర్ణ, అరుణ, పరశురామ్, మిన్నారావు, అనురాధ, దుర్గారావు, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

లూయిస్ బ్రెయిలీ జయంతి రేపు



ఎస్.అర్జునరావు, అంధుల సమాఖ్య అధ్యక్షుడు

పరవాడ: బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలను స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో ఈ నెల 4న నిర్వహించనున్నట్లు అంధుల సమాఖ్య ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు ఎస్.అర్జునరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, స్థానిక ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పి.ఎస్.రాజు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

'మెనూ ప్రకారం భోజనం'



కార్యక్రమంలో పాల్గొన్న కల్పలత, అధికారులు

పెందుర్తి: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించేలా చర్యలు తీసుకోవాలని పాఠశాలల యాజమాన్య కమిటీల ప్రతినిధులకు ఆ విభాగం రాష్ట్ర పరిశీలకురాలు కల్పలత సూచించారు. గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పాఠశాల యాజమాన్య కమిటీ మండల స్థాయి ఒక్క రోజు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎంసీ ప్రతినిధుల విధివిధానాలను వివరించారు. ఎంఈవో-1 సువర్ణ, ఎంఈవో-2 మధుమూర్తి, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

కత్తులు దూస్తున్న కోళ్లు



దేగ, సేతువ, కాకిడేగ, అబ్రాసు, కొక్కిరాయి, కాజు, నల్లబోర, నెమళ్లు, పెట్టమారి, పర్ల.. ఈ పేర్లు వింటేనే పల్నాటి పౌరుషాలు గుర్తుకొస్తున్నాయా? కోస్తా జిల్లాల సంక్రాంతి హడావుడి కళ్లముందు సాక్షాత్కరిస్తోందా..? అయితే మీకు కోడి పందాలపై అంతో ఇంతో ఆసక్తి ఉన్నట్లే..! ఈ హడావుడి పెందుర్తి నియోజకవర్గానికి ఎప్పుడో పాకింది. సంక్రాంతి మరో 10 రోజులున్నా.. అప్పుడే మారుమూల ప్రాంతాల్లో పందెంరాయుళ్ల సందడి మొదలైంది.



పెందుర్తి:

తెలుగువారి పెద్ద పండగ సంక్రాంతికి కౌంట్ డౌన్ షురూ అయింది. సంక్రాంతి సంబరాల్లో అన్ని వేడుకలు ఒక ఎత్తు.. కోడి పందాలు మరో ఎత్తు. సినిమా ఫైట్స్‌ను మించిపోయే కోడి పుంజుల పోరాటానికి పందెం రాయుళ్లు పందెం కోళ్లను సిద్ధం చేస్తున్నారు. మనుషులు జిమ్‌లో కసరత్తు చేసినట్లే.. పందెం కోళ్లను సిద్ధంచేసే షెడ్లు కోడిపుంజుల జిమ్‌లను తలపిస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో చాలా వరకు వీటిపై నియంత్రణ చేయగలిగారు. ప్రభుత్వం మారడటంతో.. కూటమి నాయకుల అండదండలతో నియోజకవర్గంలోని చాలా గ్రామాల్లో పందాలు మొదలయ్యాయి. పోలీసుల కళ్లుగప్పి, మామూళ్లు ముట్టజెప్పి తోటలు, చెరువు గట్లనే పందెం వేదికలుగా మార్చేస్తున్నారు. పెందుర్తి, సబ్బవరం, పరవాడ ప్రాంతాల్లో నిత్యం రూ.లక్షల్లో కోడిపందాల జూదం సాగుతున్నట్లు తెలుస్తుంది.

వీటి సంరక్షణ ప్రత్యేక ఆర్ట్

పందెం కోళ్ల సంరక్షణ.. అదొక ఆర్ట్. పసి బిడ్డను సాకినంత అపురూపం. నిత్యం ఉడకబెట్టిన గుడ్లు, మటన్ ఖైమా, జీడిపప్పు, రాగులు, సజ్జలు, బాదం, పిస్తా తదితర పోషకాహారం పెడతారు. బరువు పెరగకూడదు. చురుకుదనం కోల్పోకూడదు. వాటిలో పౌరుషాన్ని రగిల్చేందుకు అప్పుడప్పుడూ అశ్వగంధ పొడి పట్టిస్తారు. కొందరు విటమిన్ టాబ్లెట్లు నీటిలో కరిగించి, ఆ నీటిని కోళ్లతో తాగిస్తారు. పందెంరాయుళ్లు చన్నీటి స్నానాలు చేసినా.. ఈ పందెం కోళ్ల స్నానానికి, తాగేందుకు వేడి నీటినే వాడతారు. అలుపు నియంత్రణ కోసం వాటిని నీళ్లలో వదిలి వారం పదిరోజులకోసారి ఈత కొట్టిస్తారు. వెంటపడి తరుముతూ వేగంగా పరిగెత్తిస్తారు. వాస్తవంగా చెప్పాలంటే.. వీటి పోషణ ఓ స్పీడ్ మారథాన్ ఆటగాడిని అన్ని విధాలా పోటీకి సన్నద్ధం చేసినట్టే..!

గ్రామాల్లో ఊపందుకున్న కోడిపందాలు

వడ్డీ వ్యాపారులకు ఆదాయం

మరోవైపు పందెంరాయుళ్ల బలహీనత ప్రైవేట్ వడ్డీ వ్యాపారులకు వరంగా మారుతోంది. పందాల్లో నగదు పోగొట్టుకున్న వారు అత్యవసరంగా డబ్బు కోసం వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయిస్తున్నారు. వాహనాలు, భూముల పత్రాలు తాకట్టుపెట్టి నగదు తీసుకుని పందాలు కాస్తున్నారు. పందెంరాయుళ్ల అవసరాన్ని

పోలీసుల కళ్లుగప్పి తోటలు, చెరువుగట్లపై నిర్వహణ

బట్టి రోజుకు రూ.వందకు రూ.8 నుంచి రూ.10 వరకు వడ్డీలు వసూలు చేస్తున్నారు.

కుక్కుట శాస్త్రంపై మక్కువ

ఏ పుంజుపై పందెం కాయాలనే విషయంలో కోడి కండను చూడటమేకాక, కోడి జ్యోతిష్యంపై కూడా ఆధారపడుతున్నారు పందెం రాయుళ్లు. మనుషులకు జ్యోతిషశాస్త్రం ఉన్నట్లే కోళ్లకు కూడా కుక్కుట శాస్త్రం వ్యవహారంలో ఉంది. చాలామంది పందెం రాయుళ్లు కుక్కుట శాస్త్రాన్ని అనుసరించే పందాలు కాస్తారు. ఏ జాములో, ఏ రోజు, ఏ రంగు పుంజుపై పందెం వేస్తే గెలుస్తుందో కుక్కుట శాస్త్రంలో ఉందనీ పెంపకందార్లు చెబుతున్నారు. తమ జాతక బలానికి, కోడి జాతక బలం తోడైతే ఇక విజయం తమదేనని కొందరు పందెంరాయుళ్ల నమ్మకం.



పుంజులకు గిరాకీ..

సంక్రాంతి పండగ పందెం పుంజుల పెంపకందార్లకు మంచి రాబడిని అందిస్తుంది. గ్రామాల్లో ప్రత్యేక శ్రద్ధ వహించి పెంచే ఈ కోడి పుంజులకు రానున్న రెండు నెలలు మంచి గిరాకీ ఉంటుంది. సంక్రాంతి మూడు రోజులతో పాటు అమ్మవార్ల పరసల్లో కూడా పందాలు సాగుతాయి. అందు కోసం పందెంరాయుళ్లు ఇప్పటినుంచే పుంజుల్ని సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ఒక్కో పుంజు ధర రూ.3 వేల నుంచి రూ.10 వేల వరకు పలుకుతోంది. కేవలం పందెం కోసమే పెంచే కొన్ని మేలురకం జాతి పుంజులైతే రూ.20 వేలు నుంచి రూ.లక్ష వరకు పలుకుతాయట. కాకపోతే వీటిని ఉభయగోదావరి జిల్లాల నుంచే ఎక్కువగా తెచ్చుకుంటున్నట్లు సమాచారం.

కూటమి నాయకుల అండదండలతో విచ్చలవిడిగా పందాలు



పుంజుకు కత్తికడుతున్న పందెం రాయుడు

కఠిన చర్యలు తీసుకుంటాం



సంక్రాంతి సమయంలోనే కాదు సాధారణ రోజుల్లో కూడా కోడిపందాలు, పేకాట, లాటరీ బల్లలు పూర్తిగా నిషేధం. గ్రామాల్లో ఎక్కడైనా ఇటువంటివి నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. పోటీల్లో పాల్గొన్నవారు ఎంతటివారైనా ఉపేక్షించబోం. పందాలు, జూదం జరుగుతుంటే మాకు సమాచారం అందించండి.

– కె.వి.సతీష్‌కుమార్, సీఐ, పెందుర్తి

హెల్మెట్ లేకపోతే లైసెన్స్ రద్దు



తనిఖీలు చేస్తున్న ఎస్ఐ నరసింహరాజు, సిబ్బంది

పెందుర్తి: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పెందుర్తి ట్రాఫిక్ విభాగం సబ్ ఇన్‌స్పెక్టర్ ఎన్.నరసింహరాజు సూచించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే తొలిసారి జరిమానా విధించడంతో పాటు లైసెన్స్ సీజ్ కోసం డీటీవోకు సిఫార్సు చేస్తామన్నారు. రెండోసారి అదే తప్పుతో దొరికితే వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. గురువారం పెందుర్తి, పురుషోత్తపురం, సుజాతనగర్, చినముషిడివాడ, నాయుడుతోట, వేపగుంట తదితర ప్రాంతాల్లో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతీ వాహన చోదకుడు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. తప్పనిసరిగా అన్ని రికార్డులు వెంట ఉంచుకోవాలన్నారు. లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ఎన్టీపీసీ ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎన్టీపీసీ సీజీఎం సమీర్‌శర్మ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంస్థ సీజీఎం సమీర్‌శర్మ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సీజీఎం ఫరిదా, జీఎం జి.నవాహు, జీఎం టి.ఎస్.శ్రీపద్మప్రియ, ఏజీఎం హెచ్ఆర్ బి.బి.పాత్ర, డీజీఎం హెచ్ఆర్ అనిత్‌కుమార్, వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు అజ్మీర, వెంకటేశ్వరరావు, జి.చంద్రశేఖర్, బి.నరసింహ, పీవీ సత్యనారాయణరాజు, కార్యవర్గ సభ్యులు తాతబాబు, సురేష్, చిట్టిబాబు, చినబ్బాయి, కె.కె.సింహచలం, బనశ్రీ బౌరి, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ముందస్తు కార్యాచరణ

- అనకాపల్లి జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.80 కోట్లు
- అధికారులతో సమీక్షలో జెడ్పీ సీఈవో నారాయణమూర్తి



ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో నారాయణమూర్తి

సబ్బవరం: రానున్న వేసవిలో అనకాపల్లి జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.80 కోట్లు మంజూరు చేసిందని జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. మండలంలోని సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం స్థానిక అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో జల్ జీవన్ మిషన్ పనులు, రక్షిత మంచినీటి పథకాలు, తాగునీటి బోర్ల పనితీరు, చేపడుతున్న పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గత రెండేళ్లలో మండలంలో చేపట్టిన పనులపై సమీక్షించారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరాపై ఆరా తీయడంతో పాటు అధికారులకు పలు సూచనలు చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ఇప్పటికే కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని, ఆ మేరకు పనులు చేపడుతున్నట్లు అధికారులు ఆయనకు తెలిపారు. కార్యక్రమంలో ఏవో శివరామ ప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ జి.శివకృష్ణ, ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ హరిణి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సిబ్బంది పొరపాట్ల వల్లే రైతుల ఇక్కట్లు

- పదేపదే కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు
- పోలవరం కాలువ భూసేకరణ రైతుల వివరాల గోప్యమెందుకు?
- ఆరిపాక రెవెన్యూ సదస్సులో గ్రామ పెద్దల ఆగ్రహం



రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు

సబ్బవరం: మండలంలోని ఆరిపాకలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారుల పనితీరు, సేవల పట్ల పలువురు గ్రామ పెద్దలు అసహనం వ్యక్తం చేశారు. అధికారుల తప్పులకు, రైతులు తిప్పలు పడుతున్నారని మండిపడ్డారు. మాజీ ఎంపీటీసీ మళ్ల కోటేశ్వరరావుతో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ చిన్న చిన్న సమస్యలకు సైతం కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నా, పనులు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత రీ సర్వేలో చిన్నపాటి పొరపాట్లు తలెత్తడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రెవెన్యూ సిబ్బంది చేసిన పొరపాట్లకు రైతుల్ని ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు.

గత ప్రభుత్వంలోనే పోలవరం కాలువకు భూసేకరణ జరిగిందని, ఆరిపాక రెవెన్యూ పరిధిలో సుమారు 90 ఎకరాలు తీసుకోనున్నట్లు ప్రకటించారని తెలిపారు. అయితే ఎవరి భూమి ఎంత తీసుకుంటారో ఆ వివరాలు నేటికీ వెల్లడించలేదన్నారు. ఆరిపాకలో అభివృద్ధి చేసిన వైఎస్సార్ లే అవుట్లలో అర్హులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. దీనిపై డిప్యూటీ తహసీల్దార్ అప్పారావు మాట్లాడుతూ పోలవరం కాలువ సర్వేను మరోసారి చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మార్చిలో రెండో విడత సర్వే జరుగుతుందన్నారు.

కార్యక్రమంలో సర్పంచ్ పాలిశెట్టి పార్వతి, వైస్ ఎంపీపీ ఝాన్సీలక్ష్మీరాణి, రీ సర్వే డీటీ గణపతిరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్‌రాజ్, గ్రామ పెద్దలు శరగడం రాము, వెంకట్, శ్రీను, నాగేష్, బాలాజీ, వీఆర్వో అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నాడు పాఠశాల.. నేడు పశువులశాల



పశువుల శాలగా మారిన ప్రాథమిక పాఠశాల భవనం

పరవాడ: కలపాక శివారు స్వయంభూవరంలో రెండు దశాబ్దాల క్రితం రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం పశువులశాలగా మారింది. నేడో రేపో కూలిపోయే దుస్థితికి చేరింది. సింహాద్రి ఎన్టీపీసీ సౌజన్యంతో 2003లో సుమారు రూ.10 లక్షల వ్యయంతో ఇక్కడ ప్రాథమిక పాఠశాల భవనాన్ని ఏర్పాటు చేశారు. మూలస్వయంభూవరంలోని పాత ఎంపీపీ పాఠశాలలో కొన్ని తరగతులు, స్వయంభూవరంలో నిర్మించిన నూతన పాఠశాల భవనంలో మరికొన్ని తరగతులను నిర్వహించాలని అధికారులు యోచించారు. కానీ మూల స్వయంభూవరానికి నూతన పాఠశాల భవనం దూరం కావడం, ఇతర కారణాలతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను నూతన పాఠశాలకు పంపడానికి వెనుకంజ వేశారు. కొంత కాలం పాటు నూతన పాఠశాల భవనంలో పలు తరగతులు నిర్వహించారు. ఆ తర్వాత పాఠశాలను ఖాళీగా వదిలేయడంతో స్థానికులు వంట సామగ్రి, పశువులశాలగా ఉపయోగిస్తూ వచ్చారు. దీంతో ఆలనాపాలనా లేని పాఠశాల భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. కొంత కాలానికి శ్లాబ్ కూడా కూలిపోయింది. గచ్చులు పూర్తిగా ధ్వంసమై భవనం ఎందుకూ పనికి రాకుండా పోయింది.

సోలార్ వినియోగంతో విద్యుత్ బిల్లులు తగ్గుముఖం



సోలార్ విద్యుత్‌పై దుకాణాల్లో అవగాహన కల్పిస్తున్న ఏపీఈపీడీసీఎల్ అధికారులు

అగనంపూడి: సోలార్ విద్యుత్ వినియోగం వల్ల డబ్బుల ఆదాతోపాటు నిరంతరం విద్యుత్ సౌకర్యం అందుబాటులో ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఏఈ రుషికేశ్వర్ అన్నారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా కేబీఆర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కూర్మన్నపాలెంలోని దుకాణాలు, వాణిజ్య సముదాయాల్లో సోలార్ విద్యుత్ యూనిట్ల ఏర్పాటుపై అవగాహన కల్పించారు. సోలార్ విద్యుత్ వినియోగించడానికి అవసరమైన సోలార్ పరికరాలు రాయితీ ధరలకే ప్రభుత్వం అందిస్తుందన్నారు. దీంతో నెలవారి విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా డీఆర్ మొబైల్స్, వస్త్ర దుకాణాలు, సినిమాహాళ్లు, ఆస్పత్రుల్లో యాజమాన్యాలకు కరపత్రాలు అందించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ధనుంజయ్, నాయక్, లైన్‌మెన్ చెక్కా ప్రకాష్, రమణ తదితరులు పాల్గొన్నారు.

వేంకటాద్రిపై ఘనంగా ధనుర్మాసోత్సవాలు





స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై జరుగుతున్న ధనుర్మాసోత్సవాల్లో భాగంగా 18వ రోజు గురువారం వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు మహర్షి రామానుజాచార్యుల ఆధ్వర్యంలో వేకువజామున హారతి, సేవాకాలం, శాత్తుమురై, తిరుప్పావై పారాయణం, ప్రవచనం, తీర్థగోష్టి చేశారు. వరుసగా రెండోరోజు స్వామివారు నవనీత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. తిరుప్పావై 18వ పాశుర విన్నపం చేశారు. అనంతరం ఈవో నీలిమ పర్యవేక్షణలో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 5న వేంకటాద్రిపై సుదర్శన హోమం నిర్వహించనున్నారు.

జుత్తాడలో గ్రామ రెవెన్యూ సదస్సు నేడు

పెందుర్తి: మండలంలోని వాలిమెరక గ్రామ సచివాలయంలో జుత్తాడ రెవెన్యూ పరిధిలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఆనంద్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జుత్తాడ రెవెన్యూ పరిధిలో భూములున్న రైతులు రెవెన్యూ పరమైన, ఇతరత్రా సమస్యలను అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి ఈ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గతంలో నిర్వహించిన భూ రీసర్వేలో చోటుచేసుకున్న పొరపాట్లు, తప్పుడు వివరాల నమోదుపై ప్రధానంగా ఈ సదస్సు దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేలా కృషి చేయాలి



మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి శ్యామ్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితుల నాయకులు

పెదగంట్యాడ: నాలుగు నెలలుగా ఉక్కు ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదని, దీంతో వారంతా కుటుంబ పోషణకు మరో దారి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఉక్కు నిర్వాసితుల సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జీతాలు చెల్లించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో చర్చించి, కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ మేరకు మానవ హక్కుల కమిషన్ కార్యదర్శి ఎం.శ్యామ్‌ప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండగను ఉక్కు ఉద్యోగులు, కార్మికులు జరుపుకునే పరిస్థితి లేదన్నారు. ఉద్యోగులు, కార్మికుల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని జీతాలు చెల్లించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి మహేశ్వరరెడ్డి, గొందేశి సత్యారావు, అప్పలరెడ్డి, మంత్రి గోపీనారాయణ, యల్లేటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంక్షేమ సంఘం క్యాలండర్ ఆవిష్కరణ



నూతన సంవత్సర క్యాలండర్ ఆవిష్కరిస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి మండల యాదవ సంక్షేమ సంఘం క్యాలండర్‌ను సంఘం ప్రతినిధులు గురువారం ఆవిష్కరించారు. నాయుడుతోటలో సంఘ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ ఏడాది సంఘం కార్యాచరణ, సేవా కార్యక్రమాల ప్రణాళికపై చర్చించారు. గత ఏడాది కాలంలో మండలంలోని యాదవ కుటుంబాల సంక్షేమం కోసం చేపట్టిన కార్యక్రమాలను, అందుకైన వ్యయాన్ని సభ్యులకు వివరించారు. ఈ ఏడాదిలో కూడా పేద యాదవ కుటుంబంలో ఉన్నత చదువులు చదువుతున్న యువతకు ఆర్థికంగా సహాయసహకారాలు అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు అయిత సింహాచలం, బంధం రాంబాబు, కాయిత ఎర్రిబాబు, పీతల విష్ణుమూర్తి, కోడిబోయిన శ్రీను, కోరాడ చందుయాదవ్, నూనెల దేముడు, చీర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 235 వినతులు

పెందుర్తి: వేపగుంట రెవెన్యూ పరిధిలో సమస్యల పరిష్కారం కోసం గురువారం స్థానిక జీవీఎంసీ కల్యాణ మండపంలో జరిగిన సదస్సులో మొత్తం 235 వినతులు వచ్చాయి. వీఎంఆర్‌డీఏ పరిధిలో ఉన్న భూ సమస్య పరిష్కరించాలని 108, సింహాచలం దేవస్థానం భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ 105 దరఖాస్తులు, ఇతర సమస్యలపై 22 వినతులు వచ్చాయి. ఏళ్లతరబడి వీఎంఆర్‌డీఏ, సింహాచలం దేవస్థానం వివాదాలతో ఇబ్బంది పడుతున్నట్లు బాధిత నివాసులు అధికారులకు మొరపెట్టుకున్నారు. ప్రాణాల మీదకొచ్చే అవసరం ఉన్నా.. తమ స్థలాలను విక్రయించుకోలేకపోతున్నామన్నారు. ఇళ్లను పునర్నిర్మించుకోవాలన్నా తిప్పలు తప్పట్లేదని వాపోయారు. తహసీల్దార్ ఆనంద్‌కుమార్, దేవస్థానం, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.